క్లుప్తంగా

రాజుపాలెం తహసీల్దారుగా హరిబాబు



రాజుపాలెం: రాజుపాలెం తహసీల్దారుగా ఎమ్ హరిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

అచ్చంపేట తహసీల్దారుగా ప్రవీణ్‌కుమార్



అచ్చంపేట: అచ్చంపేట తహసీల్దారుగా కె.ప్రవీణ్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం నుంచి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీహెచ్ పద్మాదేవి ప్రకాశం జిల్లాకు డిప్యూటీ కలెక్టరుగా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

12న సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.కుసుమకుమారి తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలతో హాజరు కావాల్సిందిగా కోరారు. మండల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఏరియా వైద్యశాలలో టీవీల ఏర్పాటు



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వివిధ వార్డుల్లో అమర్చిన ఐదు టీవీలను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఓపీ స్టేషన్, గర్భిణీ స్త్రీల వార్డు, చిన్నపిల్లల వార్డు, బహిరంగ ప్రదేశాల్లో ఐదు టీవీలను అమర్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ టీవీలు అమర్చడం ద్వారా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక సలహాలు, సూచనలు నూరా అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇస్తారన్నారు. వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరిండెంట్ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నకరికల్లు: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం. రాంబాబు అన్నారు. మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, రూపెనగుంట్ల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం బుధవారం ఆయన పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ పి.రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

డ్రైవింగ్‌లో నిబంధనలు పాటించాలి

డీఎస్పీ పల్లపురాజు

గురజాల : డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని డీఎస్పీ పల్లపురాజు సూచించారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో 35వ జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లు వాడరాదన్నారు. సీటు బెల్టు ధరించాలన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి, సీఐ బాలకృష్ణ, ఎస్ఐలు బి.అనంత కృష్ణ, అశోక్, శివాని విద్యానికేతన్ నిర్వాహకుడు రవికుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెల్దుర్తి: జాతీయ రహదారి 565లోని వెల్దుర్తి బస్టాండ్ సెంటర్‌లో డివైడర్‌పై కూర్చున్న వ్యక్తి చెయ్యి నుజ్జునుజ్జయిన ఘటన బుధవారం జరిగింది. వెల్దుర్తి గ్రామానికి చెందిన మల్లా చిన చలమయ్య తన స్నేహితులతో బస్టాండ్ సెంటర్‌లోని డివైడర్‌పై కూర్చొని మాట్లాడుతుండగా ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం నుంచి లోడ్‌తో వస్తున్న లారీకి ద్విచక్ర వాహనం ఎదురు రావటంతో దానిని తప్పించబోయి లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆ పై కూర్చున్న చలమయ్యకు తగలడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చలమయ్యను హుటాహుటిన 108 వాహనంలో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు..

పేదలే భూ యజమానులు

- సత్తెనపల్లి డివిజన్‌లో జోరుగా పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు
- సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్న అధికారులు
- వారం రోజుల వ్యవధిలో 6,380 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి



ధూళ్ళిపాళ్ల జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

సత్తెనపల్లి: పేదలకు పైసా ఖర్చు లేకుండా ఇళ్ల స్థలాలకు యజమానులను చేసే యజ్ఞం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో నిర్విఘ్నంగా సాగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఊరూరా ఉన్న సచివాలయాల్లో పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. ఎలాంటి న్యాయ సమస్యలు తలెత్తకుండా స్థలాలపై సర్వహక్కులు కల్పించే పత్రాలు జారీ అవుతున్నాయి.

పక్కాగా పథకం అమలు..

నవరత్నాల్లో భాగంగా అమలు చేసిన పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఆచరణలోకి తెచ్చింది. డివిజన్‌లో వేలాది మందికి ప్రయోజనం కల్పించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ముందుగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించింది. ఆ సంఖ్యకు అనుగుణంగా నివాసయోగ్యమైన స్థలాల్లో పక్కా రోడ్లతో లేఅవుట్లు వేసింది. హద్దులు నిర్ణయించి స్థలాలు కేటాయించింది. విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించింది. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు బిల్లును చెల్లిస్తుంది. రాయితీపై నిర్మాణ సామాగ్రిని సమకూరుస్తోంది. నిర్మాణదారులు డ్వాక్రా గ్రూపుల్లో ఉంటే బ్యాంకు నుంచి అదనంగా మరో రూ. 35 వేలు రుణం తీసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో డివిజన్‌లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగు తున్నాయి. ఇప్పుడు ఇళ్ల స్థలాలను పేదల పేరున రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను చేతికి అందజేస్తుంది. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయాలను సబ్ రిజిస్టర్ కార్యాలయాలుగా గుర్తించింది. ప్రభుత్వం తరపున వీఆర్వోలు అధికారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయనుండగా, కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. బుధవారం విడుదలైన పోర్టెడ్ డేటా ప్రకారం సత్తెనపల్లి డివిజన్‌లో 14,427 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల స్థలాలకు గాను 6,380 స్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

మండలం	పోర్టెడ్ డేటా	రిజిస్ట్రేషన్ పూర్తి	శాతం
సత్తెనపల్లి	3,404	1,151	33.81
ముప్పాళ్ళ	403	344	85.36
రాజుపాలెం	676	421	62.28
నకరికల్లు	1,291	625	48.41
పెదకూరపాడు	2,041	1,074	53.33
అమరావతి	1,898	982	51.74
అచ్చంపేట	2,102	667	31.73
క్రోసూరు	2,289	863	37.70
బెల్లంకొండ	350	253	72.29

ప్రయోజనం ఇలా...

- స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై లబ్ధిదారులకు సర్వహక్కులు సంక్రమిస్తాయి.
- ఇంటి పట్టాను బ్యాంకులో తాకట్టు పెట్టి రుణ సాయం పొందవచ్చు.
- రిజిస్ట్రేషన్‌తో ఇంటి విలువ పెరిగి కొనుగోలుకు డిమాండ్ ఏర్పడుతుంది.
- అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకునే వీలు ఉంటుంది.
- వారసులకు గిఫ్ట్ డీడ్ కింద ఇంటిని బదలాయించవచ్చు.

ఇంటిపై సంపూర్ణ హక్కులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ సచివాలయాల్లో జరుగుతున్నాయి. ఆయా గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉన్న వారు అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. స్థలం రిజిస్ట్రేషన్‌తో ఇంటిపై లబ్ధిదారుడికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. పేద వర్గాల వారికి ఎంతో మేలు జరుగుతుంది.

– వీ.మురళీకృష్ణ, ఆర్డీవో, సత్తెనపల్లి

పేదల ప్రభుత్వానికి అండగా నిలవండి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అందుకూరులో అభివృద్ధి పనులు ప్రారంభం



అందుకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



88త్యాళ్లూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అందుకూరు(క్రోసూరు): నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమాన్ని చూసి ప్రజలు అండగా నిలవాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు కోరారు. క్రోసూరు మండలం అందుకూరులో రూ.85 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. రూ.35 లక్షలతో అందుకూరులో నిర్మించిన సీసీ రోడ్లు, నాడు–నేడు ద్వారా రూ.29 లక్షలతో ఎంపీయూపీ స్కూల్ లో నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ భవనం ఆధునికీకరణతో పాటు రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలను ప్రగతికి పట్టుకొమ్మలుగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్ వేల కోట్లు ఖర్చు పెడుతున్నారన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణంతో అన్ని సౌకర్యాలు గ్రామాల్లోకి తెచ్చారన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు బాగు చేసి రేపటి తరాల భవిష్యత్తుకు బంగారు బాట వేశారన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. గత పాలకులు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. మంచి చేయాలన్న సంకల్పం వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయన్నారు. అందుకూరు ఎస్సీ కాలనీకి రూ.65 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. సీఎం వైఎస్ జగన్, తాను ప్రజలకు మంచి చేశామని భావిస్తే పెద్దమనసుతో ఆశీర్వదించి అండగా నిలవాలన్నారు.వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే.. భవిష్యత్తులో అందుకూరు అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో మండలం వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

88త్యాళ్లూరు(క్రోసూరు): గత ప్రభుత్వం మాదిరి తాము మాటలు చెప్పడం లేదని.. అభివృద్ధిని చేతల్లో చూపిస్తున్నామని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు మండలం 88 తాళ్లూరులో గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ 88 తాళ్లూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేశానని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పౌరసేవలు

నాగవరం(క్రోసూరు) : సచివాలయ వ్యవస్థతో పౌరసేవలు ప్రజల వద్దకే వచ్చాయని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు మండలం నాగవరంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేనంబూరు శంకరరావు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో లక్షలాది ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రజలకు అవసరమైన పౌర సేవలు ఇంటి వద్దకే వచ్చాయన్నారు. నాగవరంలో రూ.3.56కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.13.17 కోట్లు పేదల ఖాతాల్లో జమ చేశామన్నారు. అంతకు ముందు గ్రామంలో నూతనంగా నిర్మించిన క్రీస్తుసంఘం చర్చిని ఎమ్మెల్యే ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపార్టీ నాయకులు, మండల వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.


సచివాలయాల ఆకస్మిక సందర్శన



గోలి సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో పి.శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన రెంటచింతల–1, 2, 3, గోలి సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కచ్చితంగా ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల పట్ల అనుచితంగా వ్యవహరించినా, వారిని ఇబ్బంది పెట్టినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు రూ.25 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్డులను ఎన్ని పంపిణీ చేయడం జరిగిందని తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ, పీఎంజేఏవై కార్డులను లబ్ధిదారులకు వలంటీర్లు కాలయాపన లేకుండా అందించాలన్నారు. కులగణన సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో ఆరోగ్యశ్రీ కార్డులు 10,448 మందికి గాను 90 శాతం అందజేసినట్లు, పీఎంజేఏవై కార్డులను 13,120 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 83 శాతం మందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోలి సర్పంచ్ మున్నా చంద్రం, కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో–2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాలలో 01 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ (నులిపురుగు నివారణ మాత్రలు) వేసి నులిపురుగులను నివారిద్దామని ఎంఈవో –2 శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అల్బెండజోల్ మాత్రలపై హెచ్ఎంలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న కచ్చితంగా అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ముందుగా తల్లిదండ్రులకు అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మొత్తం 54 పాఠశాలల్లో 9,600 మంది విద్యార్థులకు నూరు శాతం అల్బెండజోల్ మాత్రలను వేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయడం వలన ఎటువంటి హాని ఉండదన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి పిల్లలకు ఈ మాత్రలు వేయడం వల్ల నులిపురుగులను పూర్తి స్థాయిలో నివారించవచ్చన్నారు.

సర్వేయర్ కుటుంబానికి నగదు అందజేత

దుర్గి: ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కాన్వాయ్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా గాయపడిన ధర్మవరం సర్వేయర్ అంగడి కమల్ పాల తల్లిదండ్రులకు రూ.24 వేల నగదును అందజేశారు. బుధవారం స్థానిక మండల సర్వేయర్ కార్యాలయంలో సర్వేయర్ అసోసియేషన్ తరపున సభ్యులు బాధిత కుటుంబానికి మండల సర్వేయర్ వై.రఘుపతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు అసోసియేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మండల సర్వేయర్ రఘుపతి మాట్లాడుతూ అసోసియేషన్ తరపున ఎటువంటి సహాయ సహకారాలైనా అందిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉండి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంఘటన స్థలంలో మృతదేహం

అమరావతి: మండల పరిధిలోని ధరణికోటకు చెందిన వల్లభనేని శివనాగరాజు(32) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. మండలంలోని ధరణికోట గ్రామానికి చెందిన వల్లభనేని శివనాగరాజు తనతాత సంవత్సరీకానికి వెళ్లి మేనమామ నడకుదురు పుల్లారావుతో కలిసి కల్లు సేవించటానికి అమరావతి పెద్దింటమ్మగుడి దగ్గరకు చేరుకున్నాడు. మేనమామను అక్కడే ఉండమని చెప్పి వల్లభనేని శివనాగరాజు తన ద్విచక్రవాహనంపై మరోచోటకు వెళుతుండగా పెద్దింటమ్మగుడి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోవటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఉమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎమ్మెల్యే శంకరరావు ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన నాగవరం టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో టీడీపీ కార్యకర్తలు

నాగవరం(క్రోసూరు): క్రోసూరు మండలం నాగవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాగవరం గ్రామానికి చెందిన ఓర్సు శ్రీను, పస్నీరు చెంచయ్య, ఓర్సు కొండ, బచ్చల రవి, శారగొండి జగన్నాథం పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వరం

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్



మందుల కిట్టు అందజేస్తున్న నాగుర్‌మీరాన్, నాయకులు

సత్తెనపల్లి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయ పరిధిలోని 27, 29 వార్డుల ప్రజలకు పెద్ద మసీదు ఏరియా మదర్సానందు బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగూర్ మీరాన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. గత నెల 2 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయని, ఇందులో భాగంగా 3వ సచివాలయం పరిధిలోని 27, 29 వార్డుల్లో బుధవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడారు. డాక్టర్ ఆసియా జమీల్, డాక్టర్ జి ధర్మసింగ్‌శాస్త్రి, డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సిహెచ్ మధుబాబు, డాక్టర్ అనితలు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 351 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్వాడీ పోషక ఆహార ప్రదర్శనను సందర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కొలిమి షమ్మి, మేనేజర్ ఎస్.సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మహి, షేక్ జానీ, పెద్దింటి నాగేశ్వరరావు, తది తరులు ఉన్నారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహణపై దృష్టి

సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ

సత్తెనపల్లి: ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి వీలుగా పక్కా ఏర్పాట్లు చేశామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ వెల్లడించారు. అభ్యర్థి నామినేషన్ వేసే వరకు కొత్తగా ఓటర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సవరణలకు మాత్రం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు. కొత్త జాబితాలో మరణాలు ఉంటే వారి కుటుంబ సభ్యులతో పంచనామా నిర్వహించి నిర్ణీత దరఖాస్తుపై సంతకాలు తీసుకొని తొలగిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో సూపర్వైజర్లు, బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలన్నారు. అర్హులైన ఓటర్లను జాబితా నుంచి పొరపాటున డిలీట్ చేసినట్లయితే క్షేత్రస్థాయిలో బీఎల్వోలు తిరిగి రాజకీయ పార్టీల సహకారం తీసుకొని జాబితాలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా విషయంలో ఎవరైనా సరే నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎటువంటి తప్పులు లేని జాబితా ఉండాలన్నారు. నియోజకవర్గంలో 109 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని గత ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఘర్షణలు, తదితర వాటిని దృష్టిలో పెట్టుకొని మరో 15 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. పోలీస్ యంత్రాంగంతో పాటు సాంకేతిక వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఆయా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అలజడులకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు.

ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్స్‌పల్ ఉమాదేవి

బెల్లంకొండ: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయడం ద్వారా భవిష్యత్‌లో మంచి స్థాయిలో ఉంటారని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ బి.ఉమాదేవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల 23వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రిన్స్‌పల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో 17 సంవత్సరాలు కష్టపడి చదివితే మిగిలిన జీవితమంతా సంతోషంగా ఉండవచ్చన్నారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గి కళాశాల ప్రిన్స్‌పల్ ఆర్‌వీఎస్ ప్రసాద్, జెఎల్ఎస్ అసోషియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వెంకటేశ్వర్లు, చిలకూరిపేట ప్రిన్స్‌పల్ ఫీబీ, కళాశాల అధ్యాపకులు సరోజినీ, కవిత, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు భద్రతా వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎంవీఐ శేషురెడ్డి

మాచర్ల రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషురెడ్డి అన్నారు. బుధవారం మండలంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు వాహనాలను నడిపే ముందు కచ్చితంగా లైసెన్స్ తీసుకొని, హెల్మెట్ ధరించాలన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత ప్రమాదానికి గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని ప్రయాణిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు చందోలు నాగేశ్వరరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకటలక్ష్మి, ఆర్యవైశ్య వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, పరిటాల ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్, కొత్తమాసు గిరిజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

పిడుగురాళ్ల: ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లింగాల ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ట్రేడ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆహార పదార్థాలను ఎలా సంరక్షించాలనే విషయాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులను బేకరీకి తీసుకువెళ్లి కేకు, బ్రెడ్ తయారీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.